సాక్షి
హనుమకొండ
మంగళవారం । 11 । మార్చి । 2025



లక్ష మందితో రజతోత్సవ సభ

- ఉనికిచర్ల... భట్టుపల్లిలో చూశాం... మరోసారి స్థలాన్ని పరిశీలిస్తాం..
- పోరాటాలకు పురుడుపోసిన గడ్డ మీదే వచ్చేనెల 27న ఆవిర్భావ వేడుకలు
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మాజీ ఎమ్మెల్యేలు

- వివరాలు 8లో▸

ఇఫ్తార్	సహర్
మంగళ 6:30	బుధ 5:05

రంజాన్ వేళలు

‘వెల్‌నెస్’.. సేవల్లో డల్‌నెస్

- వెల్‌నెస్ సెంటర్లో అంతర్గత సమస్యతో నిలిచిన విద్యుత్
- గంటల తరబడి రోగుల ఎదురుచూపులు.. డాక్టర్ల డుమ్మా



వైద్య సేవల కోసం పడిగాపులు కాస్తున్న పెన్షనర్లు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలోని వెల్‌నెస్ సెంటర్‌లో కనీస వసతులు కరువయ్యాయి. అధికారులు, పాలకుల చిన్నచూపుతో నిత్యం రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వెల్‌నెస్ సెంటర్‌కు వయస్సు పైబడిన వారే అత్యధికంగా వస్తుంటారు. ఇక్కడ వీరికి మౌలిక వసతులు కూడా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సెంటర్‌లోని టాయిలెట్లకు తాళం వేసి ఉన్న ఘటన మరవకముందే.. సోమవారం అంతర్గత సమస్యతో సెంటర్‌లో విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సీనియర్ సిటిజన్లు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం ఓపీ ప్రారంభమైన 10 నిమిషాలకే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అప్పటికే కొంతమందికి ఆన్‌లైన్‌లో ఓపీ చిట్టీలు ఇవ్వగా .. మరికొందరికి మాత్రం ఆఫ్‌లైన్‌లో చిట్టీలు ఇచ్చారు. కానీ.. విద్యుత్ సరఫరా లేక మందుల సరఫరా నిలిచిపోయింది. వైద్యులు సైతం అందుబాటులో లేక రోగులకు ఎదురు చూపులు తప్పలేదు. సమస్య పరిష్కరించాల్సిన సెంటర్ నిర్వాహకులు ఒంటి గంట వరకు నిదానంగా పని కానిచ్చారు. ఇదే సాకుగా భావించిన కొందరు డాక్టర్లు వెళ్లిపోయారు. అనంతరం 1 గంటకు సమస్య పరిష్కారమైంది. కానీ చాలామంది అప్పటికే ఇళ్లకు వెళ్లిపోయారు. ఈవిషయంపై వైద్య సిబ్బందిని ఆరా తీయగా.. బ్రేకర్లు పడిపోవడంతో వి ద్యుత్ సరఫరా నిలిచిందని, ఇన్వర్టర్ సైతం పాడైందని తెలిపారు.

పీఆర్‌లో కారుణ్య నియామకాలు

- హనుమకొండ జిల్లాలో 58, వరంగల్ జిల్లాలో 35 పోస్టులు
- 2016 నుంచి ఎదురుచూపులు
- సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి రెండు రోజుల్లో ఉత్తర్వులు



హన్మకొండ: పంచాయతీరాజ్ శాఖలో ఎట్టకేలకు కారుణ్య నియామకాలు చేపడుతున్నారు. 2016 నుంచి ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రభుత్వం 2024 మే నెలలోపు నమోదు చేసుకున్న వారికి ఉద్యోగాలివ్వాలని నిర్ణయించింది. ఈక్రమంలో అటెండర్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ చేసింది. జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో ఉద్యోగం చేస్తూ విధుల్లో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పిస్తుంది. జిల్లా ప్రజాపరిషత్‌లలో కేవలం అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో చేరేందుకు బీటెక్, డిగ్రీ, పీజీ వంటి ఉన్నత చదువులు చదివిన కుటుంబ సభ్యులు ముందుకు రాలేదు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ లేకపోవడం, ఉన్న పోస్టుల్లో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులను జిల్లా ప్రజాపరిషత్‌లో సర్దుబాటు చేయడంతో అవి భర్తీ అయ్యాయి. దీంతో కారుణ్య నియామకాల కోసం వారికి నిరీక్షణ తప్పలేదు.

అటెండర్ టు జూనియర్ అసిస్టెంట్‌గా అప్‌గ్రేడ్

ఈక్రమంలో ప్రభుత్వం అటెండర్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంతో హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్‌లోని 58, వరంగల్‌లో 26 పోస్టులు అప్‌గ్రేడ్ కోసం ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వంనుంచి ఆమోదం లభించింది. వరంగల్ జిల్లా ప్రజాపరిషత్‌లో మరో 9 సూపర్ న్యూమరీ పోస్టులు మంజూరు చేసింది. ఈ మేరకు అధికారులు అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. హనుమకొండకు సంబంధించి 46 మంది, వరంగల్‌కు 28 మంది హాజరయ్యారు. మిగతా వారు ఎప్పుడు వచ్చినా అవకాశం కల్పిస్తామని ఆయా జిల్లాల ప్రజాపరిషత్ అధికారులు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అభ్యర్థుల జాబితాను కలెక్టర్ల ఆమోదం కోసం పంపారు. కలెక్టర్ నుంచి ఆమోదం లభించిన వెంటనే ఒకటి రెండు రోజుల్లో నియామక ఉత్తర్వులు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

న్యూస్‌రీల్

ఎల్‌ఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలి



కాజీపేట అర్బన్: భూక్రయవిక్రయదారులు ఎల్‌ఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్ తెలిపారు. కాజీపేట ఫాతిమానగర్ వంద ఫీట్ల రోడ్డులోని వరంగల్ ఆర్‌ఓ కార్యాలయంలో సోమవారం ఎల్‌ఆర్‌ఎస్ విధివిధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ హాజరై మాట్లాడుతూ.. మార్చి 31 వరకు.. 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎడిట్ ఆప్షన్ లేనందున మాడ్యూల్‌ను క్షుణ్ణంగా పరిశీలించాకే పూర్తి చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేసుకుని రిజిస్ట్రేషన్లకు రావాలని సూచించారు. డాక్యుమెంట్ రైటర్లు ఎల్‌ఆర్‌ఎస్–20 మాడ్యూల్‌పై భూక్రయవిక్రయదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 444 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో సోమవారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో 444 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 18,560 మంది పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా.. అందులో 18,116 మంది మాత్రమే హాజరైనట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. సుబేదారిలోని కాకతీయ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. పరీక్షల తీరును పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

పెన్సిల్ మొనపై ఐసీసీ ట్రోఫీ



హన్మకొండ: హనుమకొండ గోపాలపూర్‌కు చెందిన కళాకారుడు తాటికొండ శ్రీజిత్ పెన్సిల్ మొనపై ఐసీసీ చాంపియన్ షిప్ ట్రోఫీని రూపొందించాడు. ఐసీసీ చాంపియన్‌గా భారత్ నిలిచిన క్రమంలో శ్రీజిత్ 1.8 మిల్లీ మీటర్ల ఎత్తులో ఈ ట్రోఫీని తయారు చేశాడు. దీన్ని చెక్కడానికి 1.30 గంటల సమయం పట్టిందని కళాకారుడు చెబుతున్నాడు. తాను కెప్టెన్ రోహిత్ శర్మ వీరాభిమానినని, ఆయన కెప్టెన్సీలో టీమ్ స్పిరిట్‌తో బాగా ఆడి భారత్ ఐసీసీ చాంపియన్‌షిప్ కప్ దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

కేయూలో నేటి నుంచి జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో ‘ఇన్నోవేటివ్ టెక్నిక్స్ ఇన్ అనిమల్ బయోటెక్నాలజీ, ఇమ్యునాలజీ ఫర్ డిసీస్ ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్’ అంశంపై ఈనెల 11, 12 తేదీల్లో రెండ్రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్య తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి హాజరవుతున్నారు. హైదరాబాద్‌లోని బయోఫార్మా సంస్థ శాస్త్రవేత్త గీతా శర్మ కీలకోపన్యాసం చేయనున్నట్లు తాయన తెలిపారు. ఈసదస్సులో సైన్స్ డీన్ ఆచార్య జి.హనుమంతు, వివిధ సంస్థల శాస్త్రవేత్తలు పాల్గొంటారు. ఈనెల 12న ముగింపు సదస్సుకు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ శాస్త్రవేత్త రాజేందర్ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆచార్య మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. సదస్సులో 80 పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు.

కామర్స్ విభాగంలో రెండ్రోజులపాటు..

కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఈనెల 12, 13 తేదీల్లో రెండ్రోజులపాటు జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు సెమినార్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ పి.అమరవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ‘న్యూ హారిజన్స్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ అండ్ ఆపర్చునిటీస్’ అంశంపై సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు.

బతకడం కష్టంగా ఉంది..

- ఆస్తి లేదని నన్నెవరూ పోషించట్లేదు..
- నా భూమి నాకు ఇప్పించండి..
- ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్యకు వృద్ధురాలి వినతి..
- గ్రీవెన్స్‌కు 114 అర్జీలు



కలెక్టర్ ప్రావీణ్యకు సమస్యను వివరిస్తున్న అర్జీదారులు



హన్మకొండ అర్బన్: ‘భర్త మరణం తర్వాత నన్ను పోషిస్తారనే ఆశతో నాకున్న 26 గుంటల వ్యవసాయ భూమిని మనుమలు దాట్ల ప్రవీణ్, రాజ్‌కుమార్ పేరు మీద పట్టా చేయించాను. ప్రవీణ్ చనిపోవడంతో అతడి భార్య నా బాగోగులు చూడట్లేదు. దీంతో నాకు బతకడం కష్టంగా మారింది. ఆస్తి లేనందున నన్నెవ్వరూ పట్టించుకోవట్లేదు. ప్రవీణ్ భార్య భూమిని అమ్మేందుకు ప్రయత్నిస్తోంది. మొత్తం 26 గుంటల భూమిని మళ్లీ నా పేరు మీదికి చేయిస్తే శేషజీవితం ప్రశాంతంగా గడుపుతా. నన్ను సాకిన వారికి ఆస్తి ఇస్తా.. అధికారులు చర్యలు తీసుకోవాలి’ అని కలెక్టర్‌కు మొర పెట్టుకుంది భీమదేవరపల్లి మండలం కొప్పూర్‌కు చెందిన వృద్ధురాలు దాట్ల దుర్గమ్మ. ఇలా.. ఒక్కొక్కరు ఒక్కో సమస్యతో కలెక్టర్ ప్రావీణ్యకు మొర పెట్టుకున్నారు.

తక్షణమే చర్యలు తీసుకోండి..

ప్రజావాణి వినతుల పరిష్కారానికి జిల్లా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, వినతులు పెండింగ్‌లో ఉంచవద్దని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వారి సమ్యలపై వినతులు స్వీకరించారు. మొత్తం 114 వినతులు అధికారులకు అందగా.. వాటిని పరిశీలించి సంబంధిత శాఖలకు పంపించారు. గ్రీవెన్స్‌లో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ గణేశ్, ఆర్డీఓలు కన్నం నారాయణ, రమేశ్, డీఆర్డీఓ మేన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాలు తీసేశారు.. సర్టిఫికెట్ ఇవ్వండి



ఇన్‌ఫెక్షన్ కారణంగా నా ఎడమ కాలిని తొలగించారు. ప్రభుత్వ ఆసరా పింఛన్ తీసుకోవడానికి అధికారులు సదరం సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. గతంలో ఒకసారి దరఖాస్తు చేస్తే రిజెక్ట్ చేశారు. ప్రస్తుతం మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదంటున్నారు. ఉన్నతాధికారులు నాకు న్యాయం చేయాలి.

- రాచర్ల ముత్తయ్య, వంగర

రోడ్డు కబ్జా చేస్తున్నారు..



హనుమకొండ 49వ డివిజన్‌లో కొందరు వ్యక్తులు రోడ్డు కబ్జా చేసి నిర్మాణం చేపట్టారు. కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి పనులు చేస్తున్నారు. ఈవిషయంలో మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి.

- జనార్దన్, పోస్టల్ కాలనీ

పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి

- 24 గంటలు అందుబాటులో ఉంటా..
- నూతన సీపీ సన్‌ప్రీత్‌సింగ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్



సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పూర్వ సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సాయుధ పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. డీసీపీలు, అదనపు డీసీపీలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్‌గా పూర్వ సీపీ అంబర్ కిషోర్ ఝానుంచి బాధ్యతలు స్వీకరించారు. అంబర్ కిషోర్ ఝా.. నూతన సీపీకి పూలబొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వందశాతం శాంతి భద్రతలను కాపాడుతామని, ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా 24 గంటలు ప్రజల కోసం పనిచేస్తామన్నారు. ప్రధానంగా నేరాల నియంత్రణతోపాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అయిన సైబర్ క్రైం, మత్తు పదార్థాల కట్టడితోపాటు మత్తు పదార్థాలను వినియోగించే వారు, విక్రయించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. రాబోయే రోజుల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులను మరింత బలోపేతం చేస్తామన్నారు. అభినందనలు తెలిపిన వారిలో డీసీపీలు షేక్ సలీ మా, రాజమహేంద్ర నాయక్, అంకిత్ కుమార్, ఏఎస్పీ చైతన్య, అదనపు డీసీపీలు రవి, సురేశ్ కుమార్‌తోపాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, అధికారులు ఉన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూంల తనిఖీ

హన్మకొండ అర్బన్: వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులో జిల్లాకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎంలు) భద్రపర్చిన స్ట్రాంగ్ రూములను హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సోమవారం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. మూడు నెలలకోసారి కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించే త్రైమాసిక సాధారణ తనిఖీల్లో భాగంగా స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీకి గడువు నెలాఖరు



మాట్లాడుతున్న కలెక్టర్లు సత్య శారద, ప్రావీణ్య, పక్కన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభుత్వం కల్పిస్తున్న 25 శాతం రాయితీ సదుపాయాన్ని లేఔట్, నాన్ లేఔట్ ప్లాట్ల యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండలోని ‘కుడా’ కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సంబంధిత అధికారులతో కలిసి ఎల్‌ఆర్‌ఎస్‌పై లేఔట్ డెవలపర్లు, సర్వేయర్లు, యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ.. 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లే ఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్‌లు తీసుకున్న ఎల్‌ఆర్‌ఎస్‌కు వచ్చిన దరఖాస్తుదారులు క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఈ నెలాఖరు (మార్చి 31) వరకే ప్రభుత్వం గడువు కల్పించినట్లు తెలిపారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఎల్‌ఆర్ ఎస్‌కు సంబంధించి ఏ సమస్యలున్నా.. బల్దియా అధికారుల దృష్టికి తీసుకొస్తే సహకరిస్తారనన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ డెవలపర్లు, ప్లాట్ల యజమానులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో ‘కుడా’ పీఓ అజిత్‌రెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, సంబంధిత శాఖల అధికారులతోపాటు లేఔట్, నాన్ లేఔట్ యజమానులు డెవలపర్లు, టౌన్ ప్లానర్లు, లే ఔట్ రైటర్లు, బిల్డర్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో కొండచిలువ కలకలం



కొండ చిలువను పట్టుకుని తీసుకెళ్తున్న అటవీ, జూపార్కు సిబ్బంది

కమలాపూర్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో గల రాయల్ పాత ఇనుప సామగ్రి దుకాణంలో ఓ భారీ కొండచిలువ ఆదివారం రాత్రి కలకలం సృష్టించింది. స్క్రాప్ దుకాణ యజమాని తాహిర్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి సమయంలో పాత ఇనుప సామగ్రి కింద తాము ఇటీవల కొనుగోలు చేసిన ఓ పాత బీరువాను కట్ చేయడానికి వెళ్లగా.. అందులో ఓ కొండచిలువ కనిపించడంతో భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి ఆ కొండచిలువను బీరువాలోంచి ఓ డ్రమ్ములో బంధించినట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం అటవీ శాఖ ఉన్నతాధికారులు ఎఫ్‌ఆర్‌ఓ శిరీష, డిప్యూటీ ఆర్‌ఓ ప్రిసిల్ల ఆదేశాల మేరకు ఎఫ్‌బీఓ అశోక్, జూపార్క్ సిబ్బంది కొమురయ్య, కృష్ణ, మల్లారెడ్డి వచ్చి సుమారు 12 ఫీట్లకు పైగా ఉన్న కొండచిలువను ఓ గోనె సంచిలో బంధించి జన సంచారం లేని ఓ గుట్ట ప్రాంతంలోకి తీసుకెళ్లి వదిలిపెట్టినట్లు చెప్పారు. కాగా.. గూడూరు మద్యంతోట శివారు నుంచి వంగపల్లి శివారు వరకు ఉన్న ఎస్సారెస్పీ కాలువ పరిసర ప్రాంతాల్లో తరచూ కొండచిలువలు సంచరిస్తుండడంతో తాము తీవ్ర భాయందోళనలకు గురవుతున్నామని, కొండచిలువలను ఇక్కడి నుంచి జన సంచారం లేని ప్రాంతాలకు తరలించి తమను వాటి బారినుంచి కాపాడాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.



యార్డుల్లో పోటెత్తిన మిర్చి బస్తాలు

ఎటు చూసినా ఎర్ర బంగారమే

మార్కెట్‌కు వచ్చిన 80 వేల మిర్చి బస్తాలు

వరంగల్: మిర్చి సీజన్ ఊపందుకోవడంతో వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించేందుకు రైతులు భారీ మొత్తంలో మిర్చిని యార్డులకు తీసుకొస్తున్నారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం సుమారు 80 వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. దీంతో ఏ యార్డు చూసినా ఎర్ర బంగారమే కనిపించింది. వేలాది బస్తాలు రావడం, ఎండలు పెరిగిపోవడంతో మార్కెట్‌లోని హమాలీ కార్మికులు కాంటాలు పెట్టడంలో జాప్యం జరుగుతోంది. అన్ని రకాల మిర్చి రావడంతో ఘాటు పెరిగి కార్మికులు, రైతులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పక్క జిల్లాల నుంచి..

వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఆసియాలోనే అతిపెద్దది కావడంతో పక్క జిల్లాలో పండిన మిర్చి సైతం వస్తోంది. పక్క జిల్లాల్లోని మార్కెట్‌లు చిన్నవి కావడం, కొన్ని రకాలు మాత్రమే కొనుగోళ్లు చేస్తుండడంతో ఇక్కడికి బాట పడుతున్నారు. వరంగల్ మార్కెట్‌లో సుమారు 20 రకాల మిర్చిని వ్యాపారులు కొంటున్నారు. ధరలు తక్కువగా ఉంటే ఇక్కడ మిర్చిని నిల్వ చేసే సామర్థ్యం కూడా ఉండడంతో రైతులు ఇక్కడికి తీసుకొచ్చేందుకు ఆసక్తి చూపుతున్నట్లు మార్కెట్ అధికారులు చెబుతున్నారు.

అర్ధరాత్రి ఠాణాలో ఆమె!

- ఓ కేసు విషయంలో మహిళ నిర్బంధం!
- సోషల్ మీడియాలో చక్కర్లు
- ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు: పోలీసులు

ఖిలా వరంగల్: ఓ ఎస్సీ, ఎస్టీ కేసు విషయంలో శుక్రవారం అర్ధరాత్రి వరంగల్ మిల్స్‌కాలనీ పోలీసులు కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఓ మహిళను అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని రాత్రంతా పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు సోమవారం సాయంత్రం సోషల్ మీడియాలో ఓ పోస్టు చక్కర్లు కొట్టింది. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప.. సాయంత్రం 6 గంటల తర్వాత, ఉదయం 6 గంటలకు ముందు ఏ మహిళను స్టేషన్‌కు పిలిపించొద్దని చట్టంలో ఉంది. కానీ.. నిబంధనలకు విరుద్ధంగా మహిళను స్టేషన్‌లో ఉంచారని సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నంను వివరణ కోరగా.. ఎస్సీ, ఎస్టీ కేసు విషయంలో కొంత మందిని అదుపులోకి తీసుకున్నమాట వాస్తవమేనని.. కానీ.. రాత్రి సమయంలో మహిళను అదుపులో తీసుకోలేదని, ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌లో మహిళలు ఎవరూ లేరన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఎస్టీ, ఎస్సీ కేసు విషయంలో ఓ మహిళను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి భర్త ఎదుట విచారించి వెంటనే వదిలేసినట్లు ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

- సీనియర్ సివిల్ జడ్జి క్షేమదేశ్‌పాండే
- ఉత్సాహంగా ఓపెన్ టు ఆల్ చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని సీనియర్ సివిల్ జడ్జి క్షేమదేశ్‌పాండే తల్లిదండ్రులకు సూచించారు. వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ బస్టాండ్ సమీపంలోని శ్రీహర్ష కన్వెన్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ఓపెన్ టు ఆల్ ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి క్షేమదేశ్ పాండే, విశిష్ట అతిథిగా కన్వెన్షన్‌హాల్ డైరెక్టర్ వేణు హాజరై విజేతలకు బహుమతులను అందజేసి, మాట్లాడారు. టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఓపెన్ టు ఆల్ విజేతగా అల్లాడి శ్రీవాత్సవ్‌నిలవగా వరుస స్థానాల్లో రిత్విక్ గండు, షేక్ రియాజ్, స్వాతి దేవరపల్లి, ఎం.దీక్షిత్ నిలిచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్లు సీహెచ్ శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలీ, భాస్కర్ పాల్గొన్నారు.

ముగిసిన చదరంగ పోటీలు

కమల్‌కింగ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని న్యూసైన్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం ప్రారంభమైన జిల్లా స్థాయి చదరంగ పోటీలు సాయంత్రం ముగిశాయి. అండర్-7, 9, 11, 15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు టోర్నమెంట్ అకాడమీ డైరెక్టర్ రాంప్రసాద్ తెలిపారు. ముగింపు వేడుకలకు వరంగల్ చెస్ అసోసియేషన్ బాధ్యుడు బీవీ రాజగోపాల్, న్యూసైన్స్ కళాశాల డైరెక్టర్లు డాక్టర్లు బీ కొమురారెడ్డి, డాక్టర్ ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఎం.మురళీ అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. విజేతలకు నగదు పురస్కారంతోపాటు సర్టిఫికెట్, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ షేక్‌సలీం, ఆర్బిటర్లు షేక్‌ఇమాంభీ, ఎండీ ఫర్వీన్, అశ్విని, శ్రీకాంత్, మణికంఠ, తపస్వి, నితిన్‌కుమార్, మార్టిన్, అనిల్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ భూసేకరణకు సర్వే పూర్తి

- నక్కలపల్లిలో 44 ఎకరాలు..
- గాడిపెల్లి శివారులో 209 ఎకరాలు గుర్తింపు



భూ సర్వే చేస్తున్న అధికారులు, తహసీల్దార్

ఖిలా వరంగల్: మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం.. అంతకు ముందే భూ సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేయడం వేగంగా జరిగిపోయాయి. ఈక్రమంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ అధికారులు రన్ వే పొడిగింపు కోసం 253 ఎకరాల భూమిని సేకరించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. ఈనేపథ్యంలో ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రైతుల సహకారంతో కేవలం మూడు రోజుల వ్యవధిలోనే భూ సర్వే పూర్తి చేశారు. రెవెన్యూ అధికారులు.. రైతుల నుంచి వ్యక్తిగత వివరాలను సేకరించారు. రన్ వే విస్తరణకు నక్కలపల్లి శివారులో 44 ఎకరాలు, గాడిపెల్లి శివారులో 209 ఎకరాలు మొత్తం 253 ఎకరాలు భూమిని రైతులు కోల్పోతున్నారని, దీనిపై నివేదికను తయారు చేసి త్వరలోనే కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అనంతరం రైతులతో కలెక్టర్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఆనంద కుమార్, సర్వే రజిత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కంపు కంపు!

విధులు బహిష్కరించిన కేఎంసీ హాస్టళ్ల కార్మికులు

- ఇబ్బందులు పడుతున్న 1,250 మంది విద్యార్థులు

10 హాస్టళ్లు.. 1,250 మంది విద్యార్థులు

కాకతీయ మెడికల్ కళాశాలలో ఐదు బాయ్స్ హాస్టల్స్‌లో 480 మంది, ఐదు మహిళా వసతి గృహాల్లో 770 మంది మెడికోలు ఉంటూ వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. 1,250 మంది విద్యార్థుల సౌకర్యార్థం సెక్యూరిటీ, శానిటేషన్ వ్యవస్థ ఎప్పటికప్పుడు నిర్వహించేందుకు 86 మంది కార్మికులను అధికారుల నియమించారు. వీరికి గత ఎనిమిది నెలలుగా ప్రభుత్వం వేతన బడ్జెట్ మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చేసేదేమీ లేక కార్మికులు ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

కేఎంసీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు



ఎంజీఎం : ప్రభుత్వ నిర్లక్ష్యం.. వేతనాల కోసం కార్మికులు చేపట్టిన ఆందోళనతో కాకతీయ మెడికల్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న మెడికల్ విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత కీర్తి ప్రతిష్టలు పొందిన కేఎంసీ అధ్యాపకుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో కనీసం మౌలిక వసతులు కల్పించడంలో సైతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వైద్యవిద్యపై చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. మెడికల్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హాస్టళ్లలో పనిచేసే కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు విధులు బహిష్కరించి ఆందోళన చేపడుతున్నారు. 80 మందికి పైగా కార్మికులు ఆందోళన బాట పట్టడంతో హాస్టళ్లలో శానిటేషన్ వ్యవస్థ అధ్వానంగా మారింది.



హాస్టల్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

గత శుక్రవారం నుంచి కార్మికులు విధులు బహిష్కరించడంతో హాస్టళ్లలో పారిశుద్ధ్య సమస్య తీవ్రమైంది. కొన్ని హాస్టల్స్‌లో ఉండే సామూహిక మరుగుదొడ్లు పూర్తిగా అపరిశుభ్రంగా మారాయి. నీరునిల్వ ఉండడంతో వాడేందుకు వీలు లేని స్థితికి చేరాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు హాస్టల్స్ గదులను శుభ్రపరచకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శునకాల స్వైర విహారం

హాస్టల్స్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది నిర్వహణ లేకపోవడం, ఎక్కడపడితే అక్కడ చెత్తచెదారం వేయడంలో హాస్టల్స్ పరిసరాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

నీటి సమస్య ఎదుర్కొంటున్నాం..

ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు బోర్ వెల్ ద్వారా నీరునింపే పని కార్మికులు చేస్తుంటారు. వారు సమ్మెకు వెళ్లడంతో నీటి సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.



\- ఇంద్రతేజ

సమస్యను పరిష్కరించాలి..

“ కార్మికులకు వేతనాలు చెల్లించి హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ఐదు హాస్టళ్లలో పెద్ద సంఖ్యలో మహిళా విద్యార్థులు ఉంటున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే హాస్టళ్లలో ఉండలేం.



\- విహారిక, మెడికో

కోర్కెలు తీర్చే కల్పవల్లి..



ఫాతిమామాత గుహ వద్ద ఏర్పాట్లు

- ఫాతిమామాత మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ముఖ్య అతిథిగా ఓరుగల్లు పీఠకాపరి ఉడుములబాల
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్‌లోని ఫాతిమామాత ప్రజల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. చరిత్రకలిగిన ఫాతిమామాత దేవాలయం కెథడ్రల్ చర్చి ప్రాంగణం ఓరుగల్లు మేత్రాసనంలో ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రతి ఏటా మూడు రోజులపాటు నిర్వహించే ఫాతిమామాత మహోత్సవానికి వివిధ జిల్లాల నుంచి విశ్వాసులు, అన్ని వర్గాల ప్రజలు తరలివస్తుంటారు. ఈ ఏడాది ఓరుగల్లు పీఠంలో 2025 సాధారణ జూబిలీ సంవత్సరంలో బిషప్ డాక్టర్ ఉడుములబాల ఆశీర్వాద వేళలో మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బిషప్ సెక్రటరీ ఫాదర్ గంగారపు అనుకిరణ్ సోమవారం తెలిపారు. కాజీపేట మెయిన్‌రోడ్‌లో చర్చి ఎంట్రెన్స్ వద్ద నిర్మించిన మహాతోరణం ఆశీర్వాద ద్వారం, ప్రాంగణంలో జపమాల బృందావనం (రోజరి గార్డెన్)ను బిషప్ ఉడుముల బాల ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని కేథడ్రల్ చర్చి, ఫాతిమామాత గుహను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాలకు 12 జిల్లాల నుంచి 10 వేల మంది భక్తులు రానున్నట్లు తెలిపారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉడుముల బాల

మూడు రోజుల కార్యక్రమాలు..

కేథడ్రల్ చర్చిలో ఈ నెల 11వ తేదీన మంగళవారం మహాపూజ్య డాక్టర్ ఉడుములబాల దివ్యబలిపూజ సమర్పణ, దంపతులకు సన్మానం, 12వ తేదీ బుధవారం ఫాదర్ తాటికొండ జోసెఫ్, డి.జోసెఫ్ ఆధ్వర్యంలో స్వస్థత ప్రార్థనలు, దివ్యబలిపూజ, కర్నూల్ పీఠం పూజ్య ఏరువ జోజిరెడ్డిచే పూజ ప్రార్థనలు. సాయంత్రం ఫాతిమామాత స్వరూపంతో ఊరేగింపు, ఫాతిమా మాత ప్రధాన ద్వారం, రోజరి గార్డెన్ ప్రారంభం, కొవ్వత్తులతో దివ్యప్రసాద ప్రదక్షిణ దివ్యప్రసాద ఆశీర్వాదం. 13వ తేదీన గురువారం బెంగళూర్ అగ్రపీఠం మెన్సిగ్నోర్ సి.ఫ్రాన్సిస్ ఆంగ్లంలో దివ్యబలిపూజ కార్యక్రమం చేయనున్నారు. ఓరుగల్లు పీఠకాపరి అండ్ విశాఖ అగ్రపీఠకాపరి ఉడుములబాల సమష్టి కృతజ్ఞత సమర్పణ. సాయంత్రం 5:30 గంటలకు మూడో పూజ, గురుశ్రీ ఆశీర్వాదం, ఎస్.జె దివ్యపూజ పతాక అవరోహణతో పాతిమామాత ఉత్సవాల ముగింపు.

పోస్టర్ ఆవిష్కరణ

కాజీపేట: మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఫాతిమామాత ఉత్సవాలను విజయవంతం చేయాలని బిషప్ ఉడుముల బాల కోరారు. ఈమేరకు కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో స్థానిక కెథడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ కాసు మర్రెడ్డి ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. అనుకిరణ్, బొక్క దయాసాగర్, తాటికొండ జోసెఫ్, సురేష్, నవీన్ ఫాదర్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిని హత్యచేసిన తనయుడి అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ రమేశ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ పులి రమేశ్

ఎల్కతుర్తి: కన్నతల్లిని గొడ్డలితో నరికి హత్య చేసిన తనయుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి మండల కేంద్రంలో సీఐ పులి రమేశ్ తన కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన చదిరం అజయ్ తనకు రావాల్సిన భూమి వాటాను తల్లి చదిరం రేవతి(45) పంచివ్వడం లేదన్న కోపంతో ఈనెల 7న గొడ్డలితో నరికి హత్య చేశాడు. దీంతో మృతురాలి చిన్న కుమారుడు చదిరం విజయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈక్రమంలో మండలంలోని కోతులనడుమ గ్రామ సమీపంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తారసపడిన అజయ్‌ని అరెస్టు చేసి, విచారింగా.. నేరం అంగీకరిండంతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, మల్లేశం, గణేశ్, భాస్కర్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

టెన్త్ స్పాట్ విధుల రెమ్యునరేషన్ చెల్లించండి

- డీఈఓకు టీఆర్‌టీఎఫ్ వినతి

విద్యారణ్యపురి: గత ఏడాది ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం హనుమకొండలో టెన్త్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకణంలో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు నేటికీ రెమ్యునరేషన్ చెల్లించలేదు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బాసిరి రాజిబాపురావు, జనరల్ సెక్రటరీ గుగులోతు శ్రీనివాస్‌నాయక్‌లు సోమవారం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రెమ్యునరేషన్‌తోపాటు టీఏ, డీఏలు చెల్లించలేదని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈఏడాది ఏప్రిల్‌లో కూడా టెన్త్ విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఉంటుందని కానీ, గత ఏడాదికి సంబంధించిన రెమ్యునరేషనే ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని లేదంటే ఈఏడాది నిర్వహించబోయే స్పాట్ వాల్యూయేషన్‌ను ఉపాధ్యాయులు బహిష్కరించాల్సి వస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

లక్ష మందితో రజతోత్సవ సభ

- ఉనికిచర్ల.. భట్టుపల్లిలో చూశాం.. మరోసారి స్థల పరిశీలన
- ఓరుగల్లుతో బీఆర్‌ఎస్‌కు విడదీయరాని బంధం..
- పోరాటాలకు పురుడుపోసిన గడ్డమీదే ఏప్రిల్ 27న ఆవిర్భావ వేడుకలు
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి



ఉనికిచర్లలో సభాస్థలాన్ని పరిశీలించి స్థానిక నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, వరంగల్ : పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం మేరకు బీఆర్‌ఎస్ పార్టీ 25వ సంవత్సరంలోకి అడుగెడుతున్న సందర్భంగా వరంగల్‌లో రజతోత్సవ సభను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్ రావు స్పష్టం చేశారు. ఓరుగల్లుకు.. బీఆర్‌ఎస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందని, వరంగల్ వేదికగా గతంలో 15 లక్షల మందితో మహా గర్జన నిర్వహించిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల నిర్వహణ కోసం సోమవారం సాయంత్రం వరంగల్ నగర శివారులోని ఉనికిచర్ల, భట్టుపల్లి ప్రాంతాల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులతో కలిసి హరీశ్‌రావు సభాస్థల పరిశీలన చేశారు. అనంతరం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 27వ తేదీన నిర్వహించే సభకు రెండుచోట్లా స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. 14 ఏళ్ల అవిశ్రాంత పోరాటాన్ని, పదేళ్ల పరిపాలనకు నిదర్శనంగా రజతోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సామాజిక, చారిత్రక అవసరాలకోసం ఉద్యమం

సామాజిక, చారిత్రక అవసరాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ఉద్యమం చేపట్టి ప్రత్యేక తెలంగాణ సాధించినట్లు హరీశ్‌రావు అన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రారంభించిన పథకాలను కేంద్రం కాపీ కొట్టిందని, రైతుబంధు పథకం పీఎం కిసాన్‌గా, మిషన్ భగీరథ పథకాన్ని హర్ ఘర్ ఘర్‌కి జల్ అని అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో ఒక్క ఉచిత బస్సు తప్ప, ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదని అన్నారు. ప్రజలంతా కేసీఆర్ ను చూడాలని, తన మాట వినాలని కోరుకుంటున్నారని, అందుకే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హరీశ్ స్పష్టం చేశారు. ప్రజలకు పనిచేసేది ఎవరో, చెయ్యని వారు ఎవరో, పాలు ఏందో, నీళ్లు ఏందో, గట్టోడు ఎవరో, వట్టోడు ఎవరో తెలిసిందని, వారు గమనిస్తూ ఉన్నారని అన్నారు.

మిలియన్ మార్చ్ రోజు వరంగల్‌లో ఉండటం అదృష్టం..

'మిలియన్ మార్చ్‌కు సోమవారంతో 14 ఏళ్లు పూర్తి.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అత్యంత కీలకమైన ఘట్టాల్లో ఒకటైన మిలియన్ మార్చ్ జరిగిన రోజున పోరాటాల ఖిల్లా వరంగల్‌లో ఉండటం.. మీతో గడపడం అదృష్టం' అంటూ హరీశ్‌రావు నాటి సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్, శంకర్ నాయక్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నాయకులు కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, కన్నూరు సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండండి

- పంట చేతికందే వరకు చివరి ఆయకట్టుకు నీరందాలి
- కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటిలతో ఎమ్మెల్యేల భేటీ



మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో సమావేశమైన ఎమ్మెల్యేలు

సాక్షిప్రతినిధి, వరంగల్: యాసంగి పంటలు చేతికందే వరకు సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి అధికారులతో సోమవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తదితరులు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి పంటలు ఎండుతున్న ప్రాంతాల్లో పరిస్థితులను వివరించారు. అనంతరం సాగు నీటి నిర్వహణ, సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి.. అధికారులకు పలు సూచనలు చేశారు. నీటి పారుదల, వ్యవసాయ, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పంటలకు సాగు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దేవాదుల ప్రాజెక్టు కింద అత్యధికంగా వరి సాగవుతోందని, ఎగువ భాగాన రైతులు ఎక్కువ మోటార్లు పెడుతున్నారని, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని, సాగు నీటి కొరత రాకుండా చూడాలని ఆదేశించారు.

కొండపర్తికి నేడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- ములుగు జిల్లా కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకున్న గవర్నర్
- అభివృద్ధి పనుల పరిశీలన అనంతరం సమ్మక్క-సారలమ్మ దర్శనం
- గిరిజన గ్రామాల్లో అభివృద్ధిపై సమీక్షించనున్న జిష్ణుదేవ్



వేదికను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షిప్రతినిధి, వరంగల్ : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి బయలుదేరనున్న గవర్నర్.. దత్తత గ్రామం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామానికి రోడ్డు మార్గాన చేరుకుని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు మేడారంలోని ఐటీడీఏ గెస్ట్ హౌజ్‌లో భోజన విరామం తర్వాత హైదరాబాద్‌కు బయలుదేరుతారు. కాగా గవర్నర్ పర్యటన సందర్భంగా సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ దివాకర.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

గవర్నర్ టూర్ షెడ్యూల్ ఇలా...

- ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌నుంచి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామానికి రోడ్డు మార్గాన బయలుదేరుతారు
- ఉదయం 11 గంటలకు కొండపర్తి గ్రామానికి చేరుకుంటారు
- 11 నుంచి 12.30 గంటల వరకు గవర్నర్ చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం, స్థానిక ఆదివాసీలతో గవర్నర్ మాటామంతి.
- మధ్యాహ్నం 12.30 గంటలకు కొండపర్తి నుంచి మేడారంలోని సమ్మక్క సారలమ్మ గుడికి రోడ్డు మార్గాన బయలుదేరుతారు.
- 12.45 నుంచి 1 గంట వరకు అమ్మవార్ల దర్శనాలు, మొక్కులు చెల్లించనున్నారు.
- 1 నుంచి 2 గంటల వరకు మేడారంలోని ఐటీడీఏ గెస్ట్ హౌజ్‌లో భోజన విరామం.
- 2 గంటలకు ఐటీడీఏ గెస్ట్ హౌజ్ నుంచి తిరిగి హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌కు రోడ్డు మార్గాన తిరుగు ప్రయాణం.
- సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకోనున్న గవర్నర్

విద్య ద్వారానే మహిళల సాధికారత

కేయూ క్యాంపస్: విద్య ద్వారానే మహిళల సాధికారత సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూలోని మహిళా అధ్యయన కేంద్రం, మహిళా అధ్యాపకుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కేయూలోని పరిపాలనాభవనం సెనెట్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్వవిద్యాలయం మహిళా ఉద్యమాలకు ప్రధాన కేంద్రం అన్నారు. చరిత్రలో ఎంతోమంది మహిళలు పాలన నిర్వహణలో తమవంతు బాధ్యతలను నిర్వర్తించారన్నారు. మహిళలు వివిధ రంగాల్లో పురుషులతో సమానంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కేయూ ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు జ్యోతిరాణి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ దీపాజ్యోతి, పాలకమండలి సభ్యులు సురేష్‌లాల్, డాక్టర్ రమ, డాక్టర్ అనితారెడ్డి, డాక్టర్ సుకుమారి, ఆచార్య సీజే శ్రీలత, డాక్టర్ సుజాత మాట్లాడారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

- **House for sale 164 sq.yards** West Face Near Relief Hospital Arepally, Warangal. 68 Lakhs. Loan Available. Cell: 9652715142 [W-1265058]

SERVICES

- సిరి అసోసియేట్స్: హౌస్, మార్టిగేజ్, పర్సనల్, ఓపెన్ ప్లాట్స్, రేకుల, గూన పెంక ఇల్లుపై సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25001885]

WANTED

- **OT - Technicians (Exp),** Pharmacy (Exp), Lab-Technicians (Exp), Dhobi Worker & Computer Operators. Cont: Guardian Hospital, Mulugu 'X'Road, WGL. 12 to 2pm. [WA-490]
- **Wanted Bolero Car Driver** Cum Shop Keeper (Both Works) Sal: 10K - 14K. Age: 30-45 yrs. Sales & Delivery Boys. Cont: Veghan Naturals, IP. Rampur, Kazipet. 9919911016. [WA-6566]
- కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు వర్క్ చేయుటకు యువతీ, యువకులు కావలెను. P/T, F/T అవకాశాలు కలవు. Cell: 9014124476. [G-222]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చికిత్స పొందుతూ బాలింత మృతి

ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన

- ఐదుగంటల పాటు హైడ్రామా
- రాత్రి 9.30 గంటలకు మరో ఆస్పత్రికి తరలింపు
- రాత్రి 10 గంటలకు చనిపోయినట్లు ధ్రువీకరణ
- ఆస్పత్రి భవనంపై నుంచి దూకిన మృతురాలి సోదరుడు

ఫ్లాష్..ఫ్లాష్

ఎంజీఎం: వరంగల్ నగరంలోని క్యూర్‌వెల్ ఆస్పత్రిలో నిండు గర్భిణి ప్రాణాన్ని వైద్యురాలి నిర్లక్ష్యంతో బలిగొన్నట్లు మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆందోళన చేయడమే కాకుండా ఆవేదనతో మృతురాలి సోదరుడు భవనంపై నుంచి దూకాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మృతురాలి భర్త రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన జింకల రాజుకు ప్రవళిక (25)తో 2019లో వివాహం జరిగింది. 2020లో ప్రవళిక గర్భం దాల్చి సీకేఎం ఆస్పత్రిలో బాబుకు జన్మనిచ్చింది. అనంతరం ఐదేళ్ల తర్వాత మళ్లీ గర్భం దాల్చిన ప్రవళిక.. క్యూర్‌వెల్ ఆస్పత్రికి ప్రతినెలా వెళ్తూ వైద్య పరీక్షలు చేయించుకుంటోంది. ఈక్రమంలో సోమవారం ఉదయం శస్త్రచికిత్స నిర్వహించిన సదరు వైద్యురాలు.. ప్రవళికకు పాప పుట్టిందని, తల్లీబిడ్డా క్షేమం అని ఆమె కుటుంబీకులకు చెప్పారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ప్రవళికకు తీవ్ర రక్తస్రావం జరుగుతోందని, రక్తం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో ప్రవళిక భర్త రాజు, ఆమె సోదరుడు కర్రె ప్రవీణ్ సుమారుగా సాయంత్రం ఆరు గంటల వరకు క్యూర్‌వెల్ ఆస్పత్రిలో సమీపంలోని ఓ ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లో వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ అరుదుగా దొరికే నాలుగు యూనిట్ల ఏ పాజిటివ్ బ్లడ్‌ను సేకరించి అందించారు. ఈ సమయంలో రాజును పిలిచి గర్భసంచి తొలగించి ప్రవళికకు మెరుగైన వైద్యం అందిస్తామని వైద్యురాలు తెలపడంతో ఆయన సరే అన్నాడు. అనంతరం సాయంత్రం ఏడు గంటల సమయంలో అంతబాగానే ఉందని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. తిరిగి రాత్రి 9 గంటల సమయంలో ప్రవళిక పరిస్థితి విషమంగా ఉందని, ఆమె శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతోందని పేర్కొంటూ ఆమెను మరో ఆస్పత్రికి తరలించాలంటూ ఆక్సిజన్ సిలిండర్‌తో అంబులెన్స్ ద్వారా నగరంలోని ఏకశిలా ఆస్పత్రికి వైద్యులు తరలించారు. ఆ ఆస్పత్రికి తరలించి సీపీఆర్ చేస్తున్న క్రమంలో ప్రవళిక మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మొత్తం ఐదు గంటల పాటు ప్రవళికకు శస్త్రచికిత్స, వైద్యం పేరుతో వైద్యులు నానా హంగామా చేసి మృతదేహాన్ని మరో ఆస్పత్రికి తరలించి చనిపోయినట్లు చెప్పారని బాధిత కుటుంబీకులు తెలిపారు.



ప్రవళిక (ఫైల్)



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

భవనంపై నుంచి దూకిన మృతురాలి సోదరుడు

తన సోదరి వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందన్న విషయాన్ని తట్టుకోలేక సోదరుడు కర్రె ప్రవీణ్.. ఆస్పత్రి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం ఆయన తీవ్ర గాయాలతో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో ప్రవీణ్ కాళ్లు విరిగినట్లు వైద్యులు తెలిపారు.